# ఉపదేశ

-అల్లూరి గౌరిలక్ష్మి



షాపింగ్‌లో ఆలస్యమయ్యి కంగారుగా బస్టాప్ • కొచ్చాను. టైమ్ రాత్రి ఎనిమిది గంటలు పావు గంట చూసినా బస్ రాలేదు. అసలే లేటయ్యిందని భయపడుతూ బస్‌కోసం వెయిట్ చెయ్యడం దుర్భరంగా వుంది. ఇంతలో మాకాలనీ పక్కగా పోయే బస్ వచ్చింది. ఫర్వాలేదు. కాస్తదూరం నడవొచ్చులే అని ఎక్కి కూర్చున్నాను. 'బస్ త్వరగా సొంత కారులా వెళ్లి పోతే బావుండును'అనుకున్నాను.

బస్ రయ్యిన బయలుదేరింది. 'అమ్మయ్య !'అని నిట్టూర్చాను. ఓ నాలుగు కిలోమీటర్లు పోయిందో లేదో ఆగిపోయింది. బస్. బైటికి తొంగి చూశా! ట్రాఫిక్ జామ్ !ఏడుపొచ్చినంత పనయ్యింది.

మధ్యాహ్నం పిన్ని వాళ్ళింటికి వెళ్ళి అక్కడి నుంచి అంతా కలిసి షాపింగ్‌కి వెళ్ళడం కొంపముంచింది.

అక్కడ చీరల సెలక్షన్‌లో ఒళ్ళుతెలిలేదు. ఇప్పుడెలా! బస్‌లో తెలిసిన మోహం ఒక్కటీ లేదు. కాలనీ ఇంకా మూడు కిలోమీటర్లుంది. మరోపావుగంట అసహనంగా గడిచింది. ట్రాఫిక్ మొత్తం ఆగిపోయింది. చడీ, చప్పుడూ లేదు. కండక్టరు వచ్చి చావుకబురు చల్లగా చెప్పాడు. 'లారీలను అడ్డదిడ్డంగా ఆపిపోయారు. ఇంకో గంట వరకూ ట్రాఫిక్ క్లియర్‌కాదు. దగ్గరి వాళ్ళు నడిచిపోవడం మంచిది.'

ఆమాట విని సగం మంది దిగిపోయారు. ఇంట్లో ఈయన కంగారు పడుతుండొచ్చు. పిల్లలు గొడవ చేస్తుంటారు. ఎప్పుడు పోతే అప్పడే పోదామని కూచుందామంటే ఇది కాలనీ బస్ కూడా కాదాయె!

ఏమయితే అయ్యిందని బస్ దిగేశాను. ఫర్లాంగు వరకు వాహనాలు చిక్కుముడిలాపడున్నాయి. అవన్నీ దాటుకుంటూ నడిచాను. అక్కడ బస్టాప్‌లో ఓపది మంది మగాళ్ళున్నారు. ఆడవాళ్ళెవరూ లేరు. స్ట్రీట్ లైట్ కూడా లేదు. బాగా చీకటిగా వుంది. పక్కన పాన్ షాప్‌లో కిరసనాయిలు దీపం మాత్రం వెలుగుతూవుంది.

మగవాళ్ళు ఒక్కొక్కరే ట్రాఫిక్ తప్పించుకుని వస్తున్న స్కూటర్ల వాళ్ళని లిఫ్ట్ అడిగి వెళ్ళిపోతున్నారు. బస్ దిగినప్పుడున్న ధైర్యం మెల్లగా తగ్గిపోనారంభించింది. నేను కూడా ఎవరినన్నా లిఫ్ట్ అడిగితే ఎలా వుంటుంది.? ఎవ్వరైన అసలిస్తారా? ఇస్తే ఎక్కొచ్చా!ఎమైనా రిస్కా!మనసొంతా ఆందోళనతో టెన్షన్‌గా వుంది. టైమ్ తొమ్మిది దాటుతోంది.

బస్టాప్‌లో ఇద్దరు మగాళ్లు మాత్రం మిగిలారు. వాళ్ళిద్దరూ నన్నేమి అనరు కదా!గుండెలు దకదకా కొట్టుకున్నాయి. ఇంతలో లారీల మధ్య నుండి ఒక ఆటో అతికష్టం మీద బైటికొచ్చింది. దానిలో ఎవరన్నా ఉన్నారో లేదో కూడా కనబడడం లేదు.

ఆటో సరిగ్గా మాదగ్గరకొచ్చి ఆగింది. 'ఇందిరా నగర్ కాలనీ'అంటూ మా కాలనీ పేరు పిలిచాడు. వెంటనే మగవాళ్ళిద్దరూ ఒక్క సెకన్‌లో లోపలికి దూకి కూర్చున్నారు. నేను కూడా ఆటో దగ్గరగా పోయి నిలబడ్డాను.

వాళ్ళిద్దరు కాస్తజరిగారు. అయినావక్కన కూర్చోవడానికి సంకోచిస్తూ నిలబడ్డాను. డ్రైవర్ వెనక్కి తిరిగి 'సార్! ఒకరు నావక్కకి రండి'అన్నాడు ఒకతను దిగి డ్రైవర్ ప్రక్కకి వెళ్లి కూర్చున్నాడు. నేను 'అమ్మయ్య'అనుకుంటూ ఆటో ఎక్కాను. 'దేవుడు పంపినట్టే' వచ్చాడీ ఆటోవాడు అనిపించింది.

ఆటోబయలు దేరబోయేంతలో ఒక వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చి ఎక్కబోయాడు. లేడీసున్నారు. మరో ఆటో చూసుకోండి. అనేసిముందు కురించాడు. ఆటోను డ్రైవర్ నామనసు కృతజ్ఞతతో వణికింది. ఎంతమర్యాద! స్త్రీలంటే ఎంత గౌరవం!ఎన్నో ఆదర్శాలు వల్లించే వాళ్ళ దగ్గర కూడా ఇంత ఈజీనెస్ కనబడదు. ఇంత మంచి ఆటోడ్రైవర్లు కూడా ఉంటారు? ఆశ్చర్యపడ్డాను.

రెండు కిలోమీటర్లు పోగానే మాలో ఒకాయన ఆటో ఆపి, దిగి 'ఎంత?'అనడిగాడు. రెండ్రూపాయలు'అన్నాడు డ్రైవర్ నేను దిగ్భ్రమ చెందాను. ఎంత అడిగిన దొరికే ఈ సమయంలో కూడా న్యాయంగా అడుగుతున్నాడు!డ్రైవర్‌కు రెండు రూపాయ లిచ్చివెళ్లిపోయాడు. 'అదేమిటి పాపం!డ్రైవర్. మంచితనంతో రెండిమ్మంటే రెండే ఇవ్వాలా అతను?అయిదు రూపాయలిస్తే ఏంపోయింది?కృతజ్ఞత ఉండదు కదా మనుషులకి? మంచితన్నాని ఎక్స్‌ప్లాయిట్ చేస్తారు. అనిపించింది.

మరి కాస్త దూరంపోయాక రెండో అతను కూడా దిగాడు. అతన్ని కూడా రెండే అడిగాడు డ్రైవర్ అతనూ రెండే ఇచ్చాడు. ఏమిటో!ఎదుటి వాడి గొప్పతనాన్ని గుర్తించదు కదా లోకం!దబాయించి అడిగితే ఇచ్చేవాళ్ళుకాదూ ఎంతంటే అంత!

'నేను మాత్రం ఇతనికి పన్నెండు రూపాయలివ్వాలి!అనుకుంటూ లైట్‌వెలుతురులో పన్నెండూ తీసిపట్టుకున్నాను.

దూరం నుంచి మా ఇల్లు కనబడగానే ఆనందంగా 'ఆ తెల్లమేడ దగ్గరావు బాబూ'అన్నాను డ్రైవర్ వీవుతడుతూ ఆటో ఆగిన తర్వాత దిగాను 'రెండ్రూపాయలు'అన్నాడతను పక్కకి వంగి గేర్ సరిచూసుకుంటూ నేను అసంకల్పితంగా పది రూపాయల కాగితాన్ని ఎడమచేతిలోకి తీసుకుని రెండు రూపాయల బిళ్ళ మాత్రం ఇచ్చాను. ఆటో సర్రున వెళ్లిపోయింది.

చేతిలోని పది రూపాయల కాగితం బాగ్‌లో వేసుకుంటుంటే అంతరాత్మ ఫెళ్ళున హేళనగా నవ్వింది. ఆలోచనకూ, ఆచరణకూ ఇంతదూరం ఉందా?నేను అవాక్కయిపోయాను. మనుసులోని మాటకూ, చేతకూ ఎంత భేదం!

నేను కూడా నాలుగు వందల తొంభై తొమ్మిది రూపాయల చీర బిల్లు నవ్వుతూ చెల్లించి మిగిలిన రూపాయలతో ఆకు కూరల ముసలమ్మ దగ్గరికిపోయి 'రూపాయికి అయిదు కట్టలైతే వద్దు ఆరిస్తేనేతీసుకుంటా!అని బెదిరించే నగటు స్త్రీనే!

చేతిలో వెయ్యి రూపాయలు పెట్టికొన్న రెండు చీరల పాకెట్టు అతిభారంగా తోచింది. ఇంటికి చేరిన ఆనందం ఆవిరై పోగా అడుగు ముందుకు పడలేదు. దూరంగా కనుమరుగై పోతున్న ఆటో వైపు నిర్జీవంగా చూస్తూండిపోయాను.